సాక్షి
విశాఖపట్నం
శనివారం । 2 । ఆగస్టు । 2025





ఆధ్యాత్మిక శోభ

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా విశాఖ నగరంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. 8లో

కేంద్రం ఉక్కు పంజా

- తేల్చి చెప్పేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ
- కూటమి ప్రభుత్వం బండారం బట్టబయలు
- స్టీల్‌ప్లాంట్‌పై రాజ్యసభలో ఆరు ప్రశ్నలు వేసిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- వాటికిచ్చిన వివరణలో కేంద్రం వైఖరి వెల్లడి
- సెయిల్‌లో విలీనం చేసే ప్రతిపాదనే లేదని స్పష్టీకరణ
- 1,017 మంది ఉద్యోగుల ఉద్వాసనకు రంగం సిద్ధం
- మండిపడుతున్న కార్మిక వర్గాలు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తథ్యం



విశాఖ సిటీ : స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వ గూడు పుఠాణి బట్టబయలైంది. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై కేంద్రం కుండబద్దలు కొట్టింది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) నుంచి వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణ తథ్యం అని తేల్చేసింది. పెద్దల సభలో వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు వేసిన ఆరు ప్రశ్నలకు కేంద్రం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇన్నాళ్లు చెప్పుకొచ్చిన బూటకపు మాటల బండారం బయటపడింది. నోటితో నవ్వి నొసటితో వెక్కిరించారన్న చందంగా కూటమి ప్రభుత్వం తీరు ఉంది. ఒకవైపు ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా చేసే బాధ్యత తమదని చెబుతూనే.. మరోవైపు ప్లాంట్‌లో వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నా చోద్యం చూస్తుండడమే దీనికి నిదర్శనం.

వెయ్యి మందికి పైగా ఉద్యోగులకు ఉద్వాసన

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మరోసారి ఉద్వాసన పలికేందుకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. వలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) పేరుతో వేల మంది ఉద్యోగులను బయటకు పంపించాలని నిర్ణయించారు. ఇందుకోసం వీఆర్ఎస్ స్కీమ్‌ను ఇప్పటికే ప్రవేశపెట్టారు. జూన్ 15వ తేదీ వరకు వీఆర్ఎస్‌కు దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో 1,017 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర మంత్రి తన వివరణలో పేర్కొన్నారు. దీని ప్రకారం త్వరలోనే వీరిని ఇంటికి పంపించనున్నారు.

ప్రైవేటీకరణపై స్పష్టీకరణ

స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా కేంద్రం వైఖరి మరోసారి స్పష్టమైంది. ఆర్ఐఎన్ఎల్‌లో వంద శాతం పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని 2021, జనవరి 27నే కేబినెట్ కమిటీ తీర్మానం చేసినట్లు కేంద్ర మంత్రి తేల్చిచెప్పారు. దీంతో ఇన్నాళ్లు కూటమి ప్రభుత్వం ప్రజలను మాయలో ఉంచి నాటకాలు ఆడినట్లు ఈ వివరణతో అర్థమవుతోంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు ఏళ్లుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అనేక సార్లు వేడుకున్నారు. పవన్ స్వయంగా స్టీల్‌ప్లాంట్ వద్ద సభలోనే పరిశ్రమ ప్రైవేటుపరం కాదంటూ ప్రగల్భాలు పలికారు. కానీ తాజాగా కేంద్రం తన వైఖరిని మరోసారి తేల్చి చెప్పడంతో సీఎం, డిప్యూటీ సీఎం ఇన్నాళ్లు చేసినవి డ్రామాలుగా తేలిపోయింది.

సెయిల్‌లో విలీన ప్రతిపాదనే లేదు

స్టీల్‌ప్లాంట్‌ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. దీని కోసం ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేపట్టాయి. కానీ అసలు ఆ ప్రతిపాదనే లేనట్లు కేంద్ర మంత్రి తేల్చేశారు. అలాగే మూలధన వ్యయం కింద కేంద్రం రూ.11,440 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు రూ.9,824 కోట్లు మాత్రమే విడుదల చేసింది. మిగిలిన మొత్తాన్ని ఎప్పుడు విడుదల చేస్తుందో? ఆలస్యానికి గల కారణాలను మాత్రం తెలపకపోవడం గమనార్హం.

మండిపడుతున్న కార్మిక వర్గాలు

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం వైఖరిని మరోసారి స్పష్టం చేయడంతో కార్మిక వర్గాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. సీఎం, డిప్యూటీ సీఎం మాటలు నమ్మి స్టీల్‌ప్లాంట్‌పై ఆశలు పెట్టుకున్న కార్మికుల్లో ఈ సమాధానాలతో ఆందోళన మొదలైంది. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసే అవకాశాలు ఉన్నట్లు కూటమి ప్రభుత్వ పెద్దలు కార్మికులను నమ్మించారు. అయితే ఇపుడు ఆ అవకాశం కూడా లేనట్లు నిర్ధారణైంది. దీనిపై త్వరలోనే ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. త్వరలోనే అఖిలపక్ష నాయకులను కలిసి దీనిపై ప్రణాళిక రూపొందించుకోవాలని భావిస్తున్నారు.

రాజ్యసభలో సుబ్బారెడ్డి ఆరు ప్రశ్నలు



స్టీల్‌ప్లాంట్‌పై రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆరు ప్రశ్నలు వేశారు. ఆర్ఐఎన్ఎల్‌కు మూలధన పెట్టుబడి లేదా ఇతరత్రా అవసరాలకు నిధులు విడుదల చేశారా? చేస్తే ఇప్పటి వరకు ఎంత చేశారు? ఆలస్యానికి గల కారణం? పరిశ్రమలో వీఆర్ఎస్ స్కీమ్ అమలు చేయడం నిజమేనా? ఎంత మంది దానికి దరఖాస్తు చేసుకున్నారు? పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే ఆలోచన ఉందా? ఉంటే ఎందుకు? సెయిల్‌లో విలీనం చేసే అంశం మాటేమిటి? అని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విస్తుపోయే సమాధానాలు ఇచ్చారు.

న్యూస్‌రీల్

కేంద్ర కారాగారంలో హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లా కేంద్ర కారాగారంలో ఖైదీలందరికీ తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ పాజిటివ్ ఉన్నవారికి సకాలంలో మందులు అందజేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. హెచ్ఐవీతో జీవిస్తున్నవారి హక్కులను కాపాడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. హెచ్ఐవీపై అవగాహన కోసం త్వరలో నిర్వహించనున్న మారథాన్ 'రెడ్ రన్'ను విజయవంతం చేయాలని జిల్లా స్పోర్ట్స్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ట్రాన్స్‌జెండర్లందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని దివ్యాంగుల సంక్షేమ అధికారికి సూచించారు. హెచ్ఐవీ బాధితులకు ఎన్టీఆర్ పింఛన్లను సకాలంలో అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వర్ రావు, ఇతర ఉన్నతాధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ దర్శకుడు బాబీ



సింహగిరిపై సినీ దర్శకుడు బాబీ

సింహాచలం : ప్రముఖ సినీ దర్శకుడు కె.ఎస్. రవీంద్ర (బాబీ) శుక్రవారం సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అంతరాలయంలో బాబీ పేరు మీద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఎడ్యుకేషన్ సెక్రటరీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పాఠశాల సహాయకుల (స్కూల్ అసిస్టెంట్) నుంచి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి (డీఈవో) ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ నియామకాలు 2025–26, 2026–27 విద్యా సంవత్సరాల కాలానికి ఉంటాయి. 58 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోన్నతికి మరో రెండు నెలలు గడువు ఉన్నవారు, గతంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీగా పనిచేసినవారు, క్రిమినల్ కేసులు ఉన్నవారు ఈ పోస్టులకు అనర్హులు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాను ఈనెల 5వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం site.google.com/sites/deovizag వెబ్‌సైట్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఎంఈవోలను సంప్రదించాలని డీఈవో తెలిపారు.

10 రెస్టారెంట్లు, దాబాలకు నోటీసులు



తనిఖీలు చేస్తున్న జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు

బీచ్‌రోడ్డు: నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రత ప్రమాణాలను పరిశీలించడానికి ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మొత్తం 20 బృందాలు ఏకకాలంలో 40 హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలపై దాడులు చేశాయి. ఈ తనిఖీల్లో భాగంగా 42 ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించారు. పరిశుభ్రత పాటించని 10 రెస్టారెంట్లు, దాబాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉన్న పాడైపోయిన ఆహార పదార్థాలను గుర్తించి, 17 కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని పూర్ణచంద్రరావు స్పష్టం చేశారు. ఈ తనిఖీల కోసం ఇతర జిల్లాల నుంచి కూడా అధికారులను రప్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్

సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా జగదీష్..

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలో తూర్పు నియోజకవర్గం నాయకులకు అవకాశం కల్పించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ అధిష్టానం శుక్రవారం అనుబంధ విభాగం కమిటీలో తూర్పు నియోజకవర్గానికి చెందిన ఇద్దర్ని వివిధ హోదాలలో నియమించింది. 12వ వార్డుకు చెందిన చొక్కెన శేఖర్‌ను పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, 13వ వార్డుకు చెందిన బెవర జగదీష్‌ను రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించింది.

జిల్లాలో 93.55 శాతం పింఛన్ల పంపిణీ



భీమిలి మండలం గొల్లవీధిలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో 'ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు' పంపిణీ చేశారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పర్యవేక్షణలో మొత్తం 1,60,778 పింఛన్లకు గాను రాత్రి 8 గంటల సమయానికి 1,50,410 మందికి (93.55శాతం) పింఛన్లు అందజేశారు. దీనికోసం ప్రభుత్వం రూ.70.36 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.65.60 కోట్లు పంపిణీ చేశారు. ఈ నెలలో కొత్తగా 2,524 మంది వితంతువులకు, 19 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛన్లు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగరంలో జీవీఎంసీ సిబ్బంది బయోమెట్రిక్ ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన పింఛన్లను శనివారం సచివాలయాల్లో పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

సంక్షేమాన్ని విస్మరిస్తున్న కూటమి సర్కార్



వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివస్తున్న విద్యార్థులు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ హాస్టళ్లకు ప్రాధాన్యత లభించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి.కొండారెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన 'సంక్షేమ హాస్టళ్ల బాట' కార్యక్రమం ముగిసింది. ముందుగా జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పి.చైతన్యతో కలిసి కొండారెడ్డి తదితరులు జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్‌కు హాస్టళ్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ప్లకార్డులతో నిరసన ప్రదర్శన

'బొద్దింకల భోజనం, నీళ్ల పప్పు, పులిసిపోయిన పెరుగు మాకొద్దు. దోమలకు ఆహారంగా ఉండలేం. నేల మీద పడుకోలేం' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. హాస్టళ్లలో సరైన నిధులు లేకపోవడంతో పురుగుల బియ్యంతో వండిన అన్నం, కుళ్లిపోయిన కూరగాయలు పెడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి.కొండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాస్మొటిక్ చార్జీలు, మెనూలో భాగంగా ఇవ్వాల్సిన గుడ్డు, చిక్కీ, చికెన్ వంటివి కూడా సక్రమంగా అందడం లేదన్నారు. హాస్టల్ వార్డెన్లను అడిగితే నిధులు లేవని చెబుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు తులసి, పిలకా మోహన్, సందీప్, రవికాంత్, విష్ణువర్ధన్, సర్ఫరాజ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో హాస్టళ్లు

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఇళ్లను ముట్టడిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 3,878 ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు సంక్షోభంలో ఉన్నాయని ఆరోపించారు. వాటిలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 6,35,864 మంది విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భూ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యం

సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు డైరెక్టర్ గోవిందరావు



రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న గోవిందరావు

మహారాణిపేట : ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం కాకుండా కాపాడటం, భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు డైరెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి ఆయన వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. భూముల రీ–సర్వేను వేగవంతం చేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు భూముల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గోవిందరావు ఆదేశించారు. గ్రామ, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్లకు సూచించారు. వివాదాలు లేని ప్రభుత్వ ఆక్రమిత భూములను క్రమబద్ధీకరించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె. భవాని శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మహదుర్, ఏడీ సర్వే శాఖ కె. సూర్యారావు, మండల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతకు పంగనామం



- అర్హులకు దూరంగా 'అన్నదాత సుఖీభవ'
- రైతు సాయంపై కూటమి ప్రభుత్వం అడ్డంకులు
- వైఎస్సార్ సీపీ హయాంలో 25,072 మందికి రైతు భరోసా
- కూటమి ప్రభుత్వంలో 18,573 మందికే..

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు ఇచ్చే పెట్టుబడి సహాయంపై కోత విధించింది. గతంతో పోలిస్తే అర్హులైన రైతుల సంఖ్య గణనీయంగా తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఏడాదికి రూ.20,000 ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు కొత్త నిబంధనల పేరుతో వేలాది మందిని పథకం నుంచి తొలగించింది. గత ఏడాది ఈ పథకాన్ని అమలు చేయకుండా నిలిపివేసిన ప్రభుత్వం, ఈ ఏడాది విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో పెద్ద సంఖ్యలో రైతుల పేర్లు గల్లంతయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్హుల సంఖ్యలో భారీ కోత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'రైతు భరోసా' కింద 25,072 మంది రైతులకు నిధులు అందించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' కింద కేవలం 18,573 మందిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేసింది. దీని ప్రకారం సుమారు 6,499 మంది రైతులు ఈ పథకం నుంచి తొలగించినట్టయింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 'ప్రధాన మంత్రి కిసాన్' పథకం కింద 18,100 మందిని అర్హులుగా ఎంపిక చేశారు.

నిబంధనల పేరుతో ఇబ్బందులు

కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనల కారణంగా కౌలు రైతులు, కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది ఉన్నవారు, 10 సెంట్ల కన్నా తక్కువ భూమి ఉన్నవారు పథకానికి దూరమయ్యారు. అలాగే ఆధార్, ఈ–కేవైసీ, బ్యాంకు ఖాతాల అనుసంధాన సమస్యలు, వేలిముద్ర, ఓటీపీ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వల్ల కూడా చాలామంది లబ్ధి కోల్పోయారు. ప్రభుత్వం అవగాహన కల్పించడంలో విఫలమైందని రైతులు విమర్శిస్తున్నారు.

రైతులకు పెట్టుబడి కష్టాలు

పెట్టుబడి సహాయం అందక గిరిజన, ఇతర రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో దుక్కి పనులు, నాట్లు, కలుపుతీత వంటి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది నుంచి వ్యవసాయం భారంగా మారడంతో కొంతమంది సాగుకు దూరమవుతున్నారని చెబుతున్నారు.

చాలా అన్యాయం



పంట సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది కూటమి సర్కార్ ఎలాంటి సహాయం ఇవ్వలేదు. ఈ సారి కూడ ఆలస్యంగా ఇస్తున్నారు. ఇచ్చిన సాయంలో అనేక మంది రైతుల పేర్లు తొలగించారు. తొలగించడం వల్ల అర్హులైన రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో అర్హులైన రైతులకు సాయం అందేది. కానీ కూటమి అర్హుల సంఖ్య తగ్గించం అన్యాయం.

– రవ్వ ఈశ్వరరావు, తాటితూరు, భీమిలి మండలం

అర్హులందరికీ వర్తింపజేయాలి



వ్యవసాయం చేస్తున్న రైతులందరికీ ఆర్థిక సాయం అందాలి. కొంతమందికే ఇవ్వడం అన్యాయం. ఈ సీజన్‌లో రైతులందరికి పెట్టుబడి సహాయం కావాలి. కొంతమంది రైతులను జాబితా నుంచి తొలగించడం అన్యాయం.అర్హులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి.

– తమ్మిన సీతారామ్, టీ.నగరపాలెం, విశాఖ

నేడు నిధుల విడుదల

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు కూటమి సర్కార్ మూడు విడతలుగా సహాయం చేస్తోంది. రెండు విడతల కింద రూ.5 వేలు, మూడో విడతలో రూ.4 వేలు సహాయం అందిస్తుంది. కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తోంది. శనివారం రైతుల ఖాతాలో నిధులు జమ చేస్తున్నారు.

– అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి, విశాఖ

కలెక్టరేట్ ఇన్‌చార్జి ఏవోగా బీవీ రాణి


మహారాణిపేట: కలెక్టరేట్ పరిపాలనాధికారిగా (ఏవో)గా బీ.వీ.రాణిని నియమించారు. పరిపాలనాధికారి కేవీ ఈశ్వరరావు గురువారం పదవీ విరమణ చేశారు. దీంతో కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకురాలిగా ఉన్న తహసీల్దార్ బీ.వీ.రాణి ఇన్‌చార్జి పరిపాలనాధికారి(ఏవో)గా నియమించారు.

జీవీఎంసీ వెటర్నరీ ఆఫీసర్‌గా రవికుమార్

అల్లిపురం: జీవీఎంసీ వెటర్నరీ ఆఫీసర్‌గా డాక్టర్ ఎల్ రాజా రవికుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ ఎల్.రాజా రవికుమార్ ప్రస్తుతం ఏఎస్ఆర్ జిల్లా పెదబయలులో ఏరియా వెటర్నరీ హాస్పటల్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అతనిని ఏడాది పాటు డిప్యూటేషన్‌పై జీవీఎంసీ వెటర్నరీ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ 'యాప్'సోపాలు మాకొద్దు

పనిభారంతో ఆన్‌లైన్ సేవలు నిలిపివేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు



మర్రిపాలెం: యాప్‌ల ద్వారా పని భారం పెరిగిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం నుంచి ఆన్‌లైన్ సేవలను నిలిపివేశారు. పోషణ ట్రాకర్, బాలసంజీవని యాప్‌లలో లబ్ధిదారుల నమోదును తాత్కాలికంగా ఆపేశారు. అదనంగా ఆరోగ్యశాఖకు చెందిన 'ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన' పథకం నమోదు కూడా తమకే అప్పగించడంపై వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లలో నమోదుతో పాటు అనేక రికార్డులను నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. దీనికి తోడు పాత ఫోన్‌లు, సర్వర్ సమస్యలతో లబ్ధిదారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందన్నారు. అధికారులు అప్పగించిన మాతృత్వ వందన యోజన పథకం నమోదును తిరిగి ఆరోగ్యశాఖకు అప్పగించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన యాప్‌లను ఒకే యాప్‌గా మార్చాలని, నాణ్యమైన స్మార్ట్‌ఫోన్‌లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆగస్టు 4న తమ ఫోన్‌లను ఐసీడీఎస్ కార్యాలయాల్లో అప్పగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సీడీపీఓ నీలిమకు వినతిపత్రం అందజేశారు.

తొలి మ్యాచ్‌లో కింగ్స్‌తో రాయల్స్ ఢీ

8 నుంచి ఏపీఎల్ నాలుగో సీజన్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్ ఈ నెల 8న ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌తో అమరావతి రాయల్స్ తలపడనుంది. పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రాత్రి 7.30 గంటలకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఈ సీజన్‌లో మొత్తం ఏడు జట్లు పోటీ పడనున్నాయి. లీగ్ చివరి మ్యాచ్ 19న జరుగుతుంది. 21న మధ్యాహ్నం 1.30 గంటలకు ఎలిమినేటర్ మ్యాచ్, 21న రాత్రి 6.30 గంటలకు క్వాలిఫైయర్-1, 22న రాత్రి 6.30 గంటలకు క్వాలిఫైయర్-2, 23న ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు. ఏడు జట్ల ఆటగాళ్లు ఈ నెల 5, 6 తేదీల్లో విశాఖ చేరుకుని ప్రాక్టీస్ చేయనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హులైన టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ అవార్డులకు సంబంధించి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో మండల విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు సహకరించాలని సూచించారు. అవార్డుకు దరఖాస్తు చేసుకునే టీచర్లకు కనీసం పదేళ్ల సర్వీసు ఉండాలి. గతంలో రాష్ట్ర స్థాయి అవార్డు పొంది ఉండకూడదు. క్రమశిక్షణ చర్యలకు లేదా క్రిమినల్ కేసులకు గురై ఉండకూడదని డీఈవో స్పష్టం చేశారు.

వృద్ధుడి నేత్రదానం.. ఇద్దరికి చూపు


తన తండ్రి నేత్రాలను దానం చేసేందుకు ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న కోరుబిల్లి శ్రీనివాస్

పెందుర్తి: దాదాపు సంపూర్ణ జీవితం గడిపిన ఒక వృద్ధుడు మరణం తర్వాత కూడా ఇద్దరికి కంటి చూపును ప్రసాదించారు. పెందుర్తి మండలం చింతలగ్రహారానికి చెందిన కోరుబిల్లి అప్పారావు(90) వృద్ధాప్యం కారణంగా శుక్రవారం ఉదయం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ మృతుడి కుమారుడు కోరుబిల్లి శ్రీనివాస్‌ను సంప్రదించి నేత్రదానం గురించి వివరించారు. దీనికి అంగీకరించిన శ్రీనివాస్ తన తండ్రి కళ్లను దానం చేయడానికి అంగీకరించారు. అనంతరం ఎల్‌వీ ప్రసాద్ మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు అప్పారావుకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారించుకుని ఆయన నేత్రాలను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. ఆరోగ్య సమస్యలు లేకపోతే.. ఏ వయసు వారి నేత్రాలైనా కనీసం ఇద్దరికి చూపును అందించగలవని సాయి ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు.

వెల్లివిరిసిన శ్రావణ శోభ

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా నగరం ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాలంకరణలో, కురుపాం మార్కెట్‌లోని కన్యకాపరమేశ్వరి సువర్ణవస్త్ర శోభితయై భక్తులకు కనువిందు చేశారు. సింహగిరిపై సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవార్లకు క్షీరాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు జరిగాయి.



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు, సువర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

స్వర్ణాలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారిని స్వర్ణాలంకరణతో అద్భుతంగా అలంకరించారు. వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు మొదలయ్యాయి. ఈ పూజలో 103 మంది ఉభయదాతలు ప్రత్యక్షంగా పాల్గొనగా, 25 మంది ఉభయదాతలు పరోక్షంగా పూజలు చేయించుకున్నారు. వారికి కుంకుమ, ప్రసాదం పంపించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు, పలువురు ప్రముఖులు తరలివచ్చారు. శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న ఉభయదాతలు

సువర్ణవస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి మూలవిరాట్‌కు వేకువజామున 5 గంటలకు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, వివిధ పండ్ల రసాలతో సహా 108 రకాల ద్రవ్యాలతో ప్రత్యేక క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సువర్ణవస్త్రంతో అలంకరించి, 108 బంగారు పుష్పాలతో పూజలు జరిపారు. తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేసిన తర్వాత, దేవస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సుమారు 250 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, శ్రావణమాస ఉత్సవ కార్యనిర్వాహక సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సింహవల్లీ తాయారుకి లక్షకుంకుమార్చన నిర్వహిస్తున్న వైదికులు

సింహగిరిపై లక్ష కుంకుమార్చన

సింహాచలం: శ్రావణ శుక్రవారం సందర్భంగా సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఉంచి శాస్త్రోక్తంగా ఈ పూజను చేపట్టారు. లక్ష నామాలతో అమ్మవార్లకు కుంకుమ పూజ నిర్వహించి.. విశేష హారతి ఇచ్చారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదం అందజేశారు. అలాగే.. సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడామండపంలో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన పూజ కూడా వైభవంగా జరిగింది. శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి సన్నిధిని అందంగా అలంకరించారు.ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొవర్తి శ్రీనివాసాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

హెచ్‌పీసీఎల్-ఎస్‌డీఐతో ఎల్జీ ఇండియా ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎల్జీ ఇండియా, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

మహారాణిపేట: యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఎల్జీ ఇండియా సీఎస్సార్ ఫౌండేషన్, హెచ్‌పీసీఎల్-ఎస్‌డీఐ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని హెచ్‌పీసీఎల్ కార్యాలయంలో శుక్రవారం ఇరు సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణ సామర్థ్యం పెరుగుతాయని ఎల్జీ ఇండియా సీఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ గిరిజా శంకర్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించేందుకు ఇది తోడ్పడుతుందని వివరించారు. ఎల్జీ ఇండియా గ్లోబల్ హెడ్ పాల్ క్వాన్, ఎల్జీ గ్రూప్ డైరెక్టర్ సి.కె.జియాంగ్, హెచ్‌పీసీఎల్-ఎస్‌డీఐ సీఈవో ఇంతియాజ్ అర్షద్ పాల్గొన్నారు.

వృక్షాబంధన్

138 ఏళ్ల మర్రిచెట్టుకు రాఖీ కట్టిన వీఎంఆర్డీఏ కమిషనర్


రైల్వేస్టేషన్ రోడ్‌లోని భారీ మర్రిచెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థినులు, గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో ప్రతినిధులు


రాఖీ కడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: పర్యావరణ పరిరక్షణకు మహా వృక్షాలను కాపాడుకోవాలని, దీనికి గుర్తుగా వాటికి రాఖీ కట్టాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పిలుపునిచ్చారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని 138 ఏళ్ల మర్రిచెట్టుకు శుక్రవారం గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో ఆయన రాఖీ కట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానాపురం సెయింట్ జోసఫ్ కళాశాల, లిటిల్ ఏంజిల్స్ విద్యార్థినులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఈ మహా వృక్షానికి రాఖీ కట్టడం ద్వారా వృక్షాలను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేసుకోవాలన్నారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహనలక్ష్మి మాట్లాడుతూ భూమిపై ఏ జీవి అంతరించినా దాని ప్రభావం మానవాళి మనుగడపై ఉంటుందని, సమస్త జీవరాశిని కాపాడాలని పిలుపునిచ్చారు. వృక్షాబంధన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించి, ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని కోరారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఉద్యానవన శాఖాధికారిణి రాధిక మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే చెట్లు ప్రాణవాయువును ఇస్తున్నాయని, అందుకే చెట్లను కాపాడాలన్నారు. ఇందులో భాగంగా పోర్టు అథారిటీ 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అనంతరం విద్యార్థులు మర్రిచెట్టు చుట్టూ వలయంగా ఏర్పడి వృక్షాలను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. వనమాలి సీటీజీ గ్రూప్ విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఇతర ప్రతినిధులు, వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ పుస్తకాల్లోనే పరీక్షలు

ఆరిలోవ: జిల్లాలోని పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు అసైన్‌మెంట్ పుస్తకాలలో పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే నాలుగు మండలాలకు ఈ పుస్తకాలు చేరగా, మిగిలిన ఏడు మండలాలకు కూడా త్వరలో అందనున్నాయి. ఈ పుస్తకాలు చేరిన మండలాల్లోని పాఠశాలలకు పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఇకపై ప్రత్యేక పేపర్లపై కాకుండా ఈ అసైన్‌మెంట్ పుస్తకాల్లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. 1 నుండి 9వ తరగతి విద్యార్థులు ఫార్మేటివ్ 1, 2, 3, 4, సమ్మేటివ్ 1, 2 పరీక్షలు ఈ పుస్తకాలలోనే రాస్తారు. అయితే 10వ తరగతి విద్యార్థులు ఫార్మేటివ్ 1, 2, 3, 4 , సమ్మేటివ్ 1 పరీక్షలను అసైన్‌మెంట్ పుస్తకాలలో రాసి, పబ్లిక్ పరీక్షలను మాత్రం యథావిధిగా రాస్తారు. విద్యార్థులు రాసిన పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు దిద్ది మార్కులు వేసిన తర్వాత, ఆ పుస్తకాలను తిరిగి విద్యార్థుల నుంచి సేకరించి భద్రపరుస్తారు.

ఫార్మేటివ్ 1 పరీక్ష వాయిదా

ఈ నెల 4వ తేదీన జరగాల్సిన ఫార్మేటివ్ 1 పరీక్ష, అసైన్‌మెంట్ పుస్తకాలు సకాలంలో పాఠశాలలకు చేరకపోవడం వల్ల వాయిదా పడింది. ఈ పరీక్షలు ఈ నెల 11, 12, 13, 14 తేదీల్లో జరగనున్నాయి.

ఒకటి, రెండు రోజుల్లో అన్ని మండలాలకు..

జిల్లాలో శుక్రవారం నాటికి చినగదిలి, గాజువాక, పద్మనాభం, భీమిలి నాలుగు మండలాలకు అసైన్‌మెంట్ పుస్తకాలు చేరాయి. మిగిలిన 7 మండలాలకు ఒకటి, రెండు రోజుల్లో ఇవి చేరనున్నాయి. వాటిని జిల్లాల్లో అన్ని మండలాల్లో పాఠశాలలకు వెంటనే చేర్చనున్నాం. ఈనెల 11, 12, 13, 14న ఫార్మటివ్ 1 పరీక్షలు విద్యార్థులు ఈ అసైన్‌మెంట్ పుస్తకంలో రాయనున్నారు. ఈ పుస్తకంలో విద్యార్థి వివరాలు కూడా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు నమోదు చేస్తారు.

–ఎన్.ప్రేమకుమార్, డీఈవో, విశాఖపట్నం

ప్రభుత్వ భూమినే అమ్మేశాడు

నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా

కూర్మన్నపాలెం: ప్రభుత్వ భూమిని విక్రయించి ఒక మహిళను మోసం చేసిన వ్యక్తికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించింది. దీనికి సంబంధించి దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. మంగళపాలెంలో తోటకూర శ్రీదేవి అనే మహిళకు టి.వెంకట సుబ్బారెడ్డి 2014లో 300 చదరపు గజాల స్థలాన్ని విక్రయించాడు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కూడా చేయించాడు. అయితే కొంత కాలం తర్వాత ఆ స్థలంలో సగం ప్రభుత్వానికి చెందినదని, అది జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం కాలనీ రహదారి కోసం కేటాయించిందని అధికారులు తేల్చారు. దీంతో బాధితురాలు అప్పట్లో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి, సుబ్బారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును విచారించిన గాజువాక ఏసీజేఎం కోర్టు.. నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు వెలువరించిందని సీఐ తెలిపారు.

దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం


తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో శతాబ్దకాలంగా నిర్వహిస్తున్న దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యబలి పూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మరియమాత ఏ విధంగా ఏసుక్రీస్తుకు చిత్తానుసారంగా జీవించి లోకానికి తల్లిగా మారిందో ఆయన వివరించారు. అనంతరం పారిస్ పాస్టోరల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో పీపీసీ అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్‌బాబు దేవమాత పతాకాన్ని ఆవిష్కరించారు. సెబాస్టియన్ కాలనీ, బిషప్ మరియదాస్ కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, రావులపల్లి, వడిచర్ల, నికోలస్, డయాస్, రాసా వీధుల్లో దేవమాత తేరును భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు ఎస్.వియత్రాజ్, వై.ప్రేమ్‌కుమార్, పీపీసీ సభ్యులు, గురు మండలి సలహా సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే గెలుపు


మాట్లాడుతున్న సీఎం రమేష్

ఎంవీపీకాలనీ: పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల గెలుపు ఖాయమని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో బీటెక్ రవి భార్య పోటీ చేస్తున్నారని తెలిపారు. ఆమె గెలుపు ఖాయమన్న ఆయన అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి పార్టీలన్నీ చాలెంజ్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. పరామర్శల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తుంటే.. దాన్ని జగన్ అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. పెద్దిరెడ్డికి చంద్రబాబుకు పోలికే లేదన్న ఆయన.. పెద్దిరెడ్డిపై కక్షసాధించాలంటే ఆ పని గతంలోనే చేసేవారన్నారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ జగన్ పర్యటనల పేరుతో అవలంబిస్తున్న తీరు మంచిదికాదన్నారు. తీరు మార్చుకోకుంటే హౌస్ అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వానికి తెలియనిది కాదని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేత సిటీ పోలీస్


ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజును సత్కరిస్తున్న ఎస్ఐ కనకారావు

విశాఖస్పోర్ట్స్/మద్దిలపాలెం: వీడీసీఏ ఆధ్వర్యంలో జరిగిన ఇన్‌స్టిట్యూషన్ లీగ్ ఫైనల్‌లో సిటీ పోలీస్ జట్టు విజయం సాధించింది. ఏపీఈపీడీసీఎల్ జట్టుపై 52 పరుగుల తేడాతో గెలిచి చాంపియన్‌గా నిలిచింది. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన సిటీ పోలీస్ జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. ఎంవీపీ ట్రాఫిక్ కానిస్టేబుల్ తొల్లాడ రాజు 96 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. ఏపీఈపీడీసీఎల్ బౌలర్లలో కార్తీక్ 4 వికెట్లు తీశాడు. 209 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఏపీఈపీడీసీఎల్ జట్టు 17.3 ఓవర్లలో కేవలం 156 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ అభిషేక్ 40 పరుగులు మాత్రమే చేయగలిగాడు. సిటీ పోలీస్ జట్టు బౌలర్ సురేష్ 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా రాజును మద్దిలపాలెంలోని ట్రాఫిక్ అవుట్‌పోస్టులో ఎంవీపీ ఎస్ఐ వి.కనకారావు సత్కరించారు.

గంజాయి వ్యాపారిపై చర్యలు

అల్లిపురం: గంజాయి వ్యాపారం చేస్తూ ప్రజల ఆరోగ్యం పాడు చేస్తున్న యువకుడిపై ఏడాది పాటు నిర్బంధం విధిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, కుమ్మరవీధి ప్రాంతానికి చెందిన సుంకరి సతీష్ అలియాస్ గుడ్డు బుర్ర గంజాయి రవాణా, అమ్మకాల కేసులో ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నాడు. దీనిపై విచారణ జరిపిన అడ్వైజరీ బోర్డు ఆదేశాల మేరకు ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి ఏడాది పాటు అతడికి నిర్బంధం విధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు.

వాల్తేర్ డివిజన్ రన్నింగ్ స్టాఫ్ నిరాహార దీక్ష


దీక్షలో పాల్గొన్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రతినిధులు, వాల్తేర్ డివిజన్ రన్నింగ్ స్టాఫ్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో పనిచేస్తున్న రన్నింగ్ స్టాఫ్ తమ సమస్యల పరిష్కారం కోసం నిరాహారదీక్ష చేపట్టారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మర్రిపాలెం డీవైడీ క్రూ లాబీ వద్ద శుక్రవారం జరిగిన ఈ నిరసనలో సిబ్బంది పలు డిమాండ్లను రైల్వే యాజమాన్యం ముందుంచారు. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం రన్నింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, రన్నింగ్ సిబ్బందికి కనీసం 120 కిలోమీటర్ల మైలేజీకి హామీ ఇవ్వాలని, ప్రస్తుతం 16 గంటల పాటు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనివేళలను సైన్ ఇన్ నుంచి సైన్ అవుట్ వరకు 9 గంటలకు పరిమితం చేయాలని, రాత్రి షిఫ్టులు రెండు రోజులకు మించి కొనసాగించకూడదని, 36 గంటల్లోగా హోం స్టేషన్‌కు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె.సంపత్ కుమార్ మాట్లాడుతూ వాల్తేరు డివిజన్ సిబ్బంది భారతీయ రైల్వేల్లో అత్యధిక ఓవర్ టైం పనిచేస్తున్నారని, అత్యధిక లోడింగ్ రికార్డు సాధించడంలో వారి కృషి కీలకమన్నారు. ఈ నేపథ్యంలోనే వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. నిరాహార దీక్ష ఫలితంగా జీఎం కమిటీ వేశారని తెలిపారు. యూనియన్ ప్రతినిధులు, అధికారులతో కూడిన కమిటీ సమావేశం తర్వాత డిమాండ్లను 10 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సాయంత్రం దీక్ష విరమించారు. కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ టి.వి.మౌళి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నరసింగరావు, డిప్యూటీ డివిజినల్ కోఆర్డినేటర్ ఎ.వెంకటరావు, అడిషనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు, ఇతర నాయకులు, రైల్వే కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాతాశిశు సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, డెంగ్యూ, ఎయిడ్స్ నియంత్రణ వంటి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన దంపతులు, గర్భిణులు, శిశువుల రిజిస్ట్రేషన్‌లను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు తగిన శిక్షణ ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుకు సూచించారు. అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆస్పత్రులపై నిఘా ఉంచి, వాటికి గల కారణాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో సర్వీసింగ్ బాయ్ మృతి

వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో విషాదం


రమణ మృతదేహం

మర్రిపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో కరెంటు షాక్‌తో సర్వీసింగ్ బాయ్ మృతి చెందాడు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి. సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటున్న బి.రమణ (41) ఐటీఐ జంక్షన్ వద్ద కుంచమాంబ వాటర్ వాష్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో రమణ సర్వీసింగ్ సెంటర్‌కు వచ్చాడు. అదే సమయంలో కారు సర్వీసింగ్‌కు వచ్చిన ఓ వ్యక్తి టీ తాగడానికి వెళ్లాడు. అతను తిరిగి వచ్చి చూసేసరికి కారు కింద నీళ్లు వస్తుండగా.. రమణ కింద పడి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు రమణకు భార్య సత్యవతి, కుమారులు జశ్వంత్, సుశ్రిత్ ఉన్నారు. జశ్వంత్ ఐటీఐ, సుశ్రిత్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో అన్ని స్కూళ్లకు బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు

రాష్ట్ర ఐటీ టీం విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్

మధురవాడ : రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల పాఠశాలలకు 5జీ సిమ్‌లు, రౌటర్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఐటీ వింగ్ ప్రతినిధి రమేష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పంపిణీని ప్రారంభించారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అందించిన 4జీ సిమ్‌లకు బదులుగా ఇప్పుడు 5జీ సిమ్‌లను అందిస్తున్నామని, త్వరలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు కూడా ఇవ్వనున్నామని తెలిపారు. ఈ సాకర్యాలు ఐఎఫ్‌పీ ప్యానల్స్, డిజిటల్ తరగతి గదులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆయా ప్రాంతాల్లో లభించే సిగ్నల్ ఆధారంగా జియో, వొడాఫోన్ సిమ్‌లను అందజేస్తున్నామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలోని 578 పాఠశాలల్లో 451 పాఠశాలలకు విద్యాశాఖ సిమ్‌లు ఇస్తుండగా, మిగిలిన 127 పాఠశాలలకు జీవీఎంసీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు సమకూరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, హెచ్ఎం ఎం. వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.